

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
8 పేజీలు | శుక్రవారం | డిసెంబర్ 1, 2023 | www.navatelangana.com

గెలుపోటములపై లెక్కలు వేసుకుంటున్న అభ్యర్థులు

ఓటెత్తిన జనం..!



• పోలింగ్ కేంద్రాలకు వరుస కట్టిన ఓటర్లు • అక్కడక్కడ మొరాయించిన ఈవీఎంలు • ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్

ఎన్నికల క్రతువులో జనం తమ వజ్రాయుధాన్ని వినియోగించారు. ఓటేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వరుస కట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కేంద్రాల వద్ద గంటల తరబడి బారులు తీరి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం సమయంలో కొన్ని ప్రాంతాల్లో కొంత సమయం పాటు ఈవీఎంలు మొరాయించడం, పార్టీల మధ్య స్వల్ప వివాదాల మినహా ఉమ్మడి జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అధికార యంత్రాంగం పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో పాటు గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటుచేసింది. చెదురుముదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఉన్నతాధికారులు ఆయా ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా ఉమ్మడి జిల్లాలో ఉదయం పూట అక్కడక్కడ ఈవీఎంలు మొరాయించడంతో కొంత సమయం ఆలస్యంగా నమోదైంది. మరికొన్ని చోట్ల ఇరు పార్టీల మధ్య స్వల్ప ఘర్షణలు తలెత్తాయి. పోలీసులు జోక్యం చేసుకొని వాటిని నివారించారు.

▶ వివరాలు..2లో...

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



జైనథ్ మండల కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు



ఓటేయడానికి వచ్చి ఇద్దరు వృద్ధుల మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓటేసేందుకు వచ్చి ఇద్దరు వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. మావల మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్ నెం.140లో అదే గ్రామానికి చెందిన వృద్ధురాలు తోకల గంగమ్మ(78) ఓటేసేందుకు వచ్చింది. లైన్‌లో నిల్చున్న క్రమంలో ఒకేసారి ఫిట్స్ రావడంతో కింద పడిపోయింది. అక్కడే పోలింగ్ ఏజెంట్‌గా ఉన్న ఉమకాంత్‌రెడ్డి గమనించి స్థానికుల సాయంతో రిమ్స్‌కు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే అమె మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ఓటెయ్యకుండానే ఆమె మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అమలుకున్నాయి. మధ్యాహ్నం 12.30గంటల ప్రాంతంలో గంగమ్మ ఓటేసేందుకు వచ్చి కింద పడిపోయిందని పోలింగ్ ఏజెంట్ ఉమకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని భుక్తాపుర్ కాలనీకి చెందిన చంద్రగిరి రాజన్న(65) మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం..రాజన్న స్థానిక గర్ల్స్ హైస్కూళ్లో తన ఓటు వేసేందుకు వచ్చాడు. క్యూలో నిలబడి ఉండగా కండ్లు తిరిగి కిందపడిపోయాడు. గమనించిన సిబ్బంది ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు రాజన్న అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు.



పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయలేదని


ఎన్నికల బహిష్కరణ

నవతెలంగాణ-నార్నూర్

గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం కుండి గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలను గ్రామస్తులు, యూత్ సభ్యులు బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఈ సారి షేకుగూడకు మార్చారని ఆరోపించారు. దీంతో తాము ఓటింగ్‌ను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. 2018 నుండి ఇప్పటి వరకు ఊరిని అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఐదు సంవత్సరాలుగా గ్రామంలో ఒక్క గ్రామసభ కూడా పెట్టలేదని గ్రామ పెద్దలు కె.లక్ష్మణ్, టి.భీము, ఉప సర్పంచ్ కె.రాము, వార్డు మెంబర్ కె.అయ్యు, మారు, జైతు, ఎం.సోనేరావ్, యూత్ సభ్యులు దుర్గారావ్, జాదు, ఆకాష్, ఆయ్యు తెలిపారు.

తాంసి : భీంపూర్ మండలం గొల్లఘాట్ గ్రామస్తులు తమ గ్రామానికి రోడ్డు సౌకర్యంతో పాటు తాగు నీటి సమస్య తీరిస్తేనే ఓట్లు వేస్తామని అసెంబ్లీ ఓటింగ్‌ను బహిష్కరించారు. ఉదయాన్నే అధికారులు పోలింగ్ సామాగ్రి, పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లారు. బూత్ నెం.23లో పోలింగ్‌కు అన్ని సిద్ధం చేసుకున్నారు. తీరా పోలింగ్ కేంద్రానికి గ్రామస్తులెవరూ రాకపోవడం ఓటింగ్‌ను బహిష్కరిస్తున్నామని చెప్పారు. దీంతో అధికారులు వెంటనే తహసీల్దార్ నారాయణకు, సిఐ నరేష్‌కుమార్, ఎస్ఐ లాల్‌సింగ్ నాయక్‌కు సమాచారం చేరవేశారు. వారు వచ్చి యువకులను, గ్రామస్తులను సముదాయించినప్పటికీ వినలేదు. కలెక్టర్ ఫోన్‌లో

▶ మిగతా..2లో...



పోలింగ్‌ను బహిష్కరించి నిరసన తెలుపుతున్న కుండిషేకుగూడ గిరిజనులు

చెన్నూర్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ మండలం దుగ్నపెల్లిలో గల 163వ పోలింగ్ కేంద్రం వద్ద ఘర్షణ వాతావరణం ఏర్పడింది. గురువారం ఉదయం పోలింగ్ కొనసాగుతున్న సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ కుమారుడు గడ్డం వంశీ పోలింగ్ కేంద్రంలోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. ఏజెంట్ పాస్‌తో పోలింగ్ కేంద్రంలోకి ఎలా వెళ్తారని అడ్డుపడ్డారు. వంశీకి ఏజెంట్ పాస్ ఎలా ఇస్తారని మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ నుండి పొందిన పాస్ ద్వారా పోలింగ్ కేంద్రంలోకి వెళితే వంశీని అడ్డుకోవడం సరికాదని ఆ పార్టీ కార్యకర్తలు ప్రశ్నించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితిని గమనించిన పోలీసులు ఇరు గ్రూపులను చెదరగొట్టడంతో కాంగ్రెస్ గో బ్యాక్ అంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో బాల్క సుమన్ డౌన్ డౌన్ అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేశారు.

తలుపులు మూసి పోలింగ్ నిర్వహించడమేంటీ : గడ్డం వివేక్

పొన్నారం, కొమ్మెర, దుగ్నెపల్లి పోలింగ్ కేంద్రాలలో అధికారులు తలుపులు మూసి పోలింగ్ నిర్వహించడం ఏమిటని కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి మండిపడ్డారు. పోలీసులు, పోలింగ్ అధికారులు సిట్టింగ్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఏకపక్షంగా కాంగ్రెస్ పార్టీకి ఓట్లు పడుతున్నాయని భావించిన బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ తట్టుకోలేక తన అనుచరులతో పోలింగ్ ప్రక్రియకు అడ్డుపడే ప్రత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో అధికారుల తీరును ఆయన తప్పుబట్టారు. పోలింగ్ కేంద్రాల తలుపులు మూసి వేసి పోలింగ్ నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారంతో పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అసెంబ్లీ ఎన్నికలు గురువారం ఉదయం నుండి సాయంత్రం వరకు సజావుగా పోలింగ్ జరిగింది. మండల కేంద్రంలోని 286 పోలింగ్ బూత్‌లో ఈవీఎంపై బీజేపీ అభ్యర్థి మహేశ్వర్ రెడ్డి ఫోటోపై సిరా ఇంకు పడడంతో బీజేపి ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో పోలింగ్ అధికారులు మరో ఈవీఎంను ఏర్పాటు చేశారు. ఆ బూత్‌లో ఇరవై నిమిషాల పాటు పోలింగ్ నిలిచిపోయింది. ఎమ్మెల్యే అభ్యర్థులు ఇంద్రకరణ్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, శ్రీహరి రావు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. మండలంలో మొత్తం ఓట్లు 18,430 ఓటర్లు ఉండగా, 15,258 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా 82.79 శాతం పోల్ అయినట్లు తహసీల్దార్ సరిత తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలోని మినీ స్టేడియం సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..సిర్పూర్(టి) మండలం డోర్‌పెల్లి గ్రామానికి చెందిన రాంటెంకి విలాస్, అతని కుటుంబీకులు కొంతకాలంగా కౌటాలలో ఉంటున్నారు. గురువారం ఎన్నికల సందర్భంగా సొంత గ్రామం డోర్‌పెల్లికి వెళ్లి ఓటు వేసి కౌటాలకు భార్య రజిత, తల్లి రుక్మాబాయితో వస్తున్నారు. ఈ క్రమంలో కౌటాల సమీపంలోకి రాగానే జింక ఒక్కసారిగా అడ్డు రావడంతో మోటార్ సైకిల్ నుండి ముగ్గురు కిందపడిపోయారు. ప్రమాదంలో విలాస్‌కు స్వల్ప గాయాలు కాగా భార్య రజిత కాలు, చేయి విరగగా రుక్మాబాయి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారికి చికిత్స నిమిత్తం సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



చెన్నూర్‌లో సతీమణితో కలిసి ఓటేసిన బాల్క సుమన్



చెన్నూర్‌లో ఓటేసిన కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్

ఓటెత్తిన జనం..!

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గత ఎన్నికల కంటే మెరుగైన శాతమే నమోదైంది. గురువారం ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5గంటల వరకు ముగిసింది. కానీ ఈ సమయానికి పోలింగ్ కేంద్రం లోపల ఉన్న ఓటర్లను చివరి వరకు అనుమతించడంతో రాత్రి 8గంటల వరకు కొనసాగింది. కొన్ని చోట్ల మరింత ఎక్కువ సమయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో పొలం పనులకు వెళ్లే వారు ఉదయమే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. పట్టణ ప్రాంతాల్లో మాత్రం మధ్యాహ్నం నుంచి పోలింగ్ శాతం పెరుగుతూ వచ్చింది. కొన్ని చోట్ల ఈవీఎంల పనితీరు మందగించడంతో పోలింగ్ ప్రక్రియ ఆలస్యానికి కారణమైంది. బెజ్జూర్‌లోని 216, 218 పోలింగ్ కేంద్రాలు, రెబ్బెనలోని 324 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో సుమారు 2గంటల పాటు నిలిచిపోయింది. ఖానాపూర్ మండలంలోని గుమ్మెన, ఎంగ్లాపూర్, నాయకపుగూడలో కరెండు, రోడ్డు సౌకర్యం కల్పించాలని మధ్యాహ్నం వరకు నిరసన తెలిపారు. అధికారులు వారిని సముదాయించడంతో మధ్యాహ్నం నుంచి పోలింగ్‌లో పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం భుక్తాపూర్‌కు చెందిన చంద్రగిరి రాజన్న, మావలకు చెందిన తోకల గంగమ్మ అనే వృద్ధులు ఓటేసేందుకు వచ్చి పోలింగ్ కేంద్రాల్లోనే మరణించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని 90వ పోలింగ్ కేంద్రం బీఆర్ఎస్, బీఎస్పీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. చెప్పులు, రాళ్లు విసురుకోవడంతో పలువురు పోలీసులకు గాయాలయ్యాయి.

లెక్కలు వేసుకుంటున్న అభ్యర్థులు

పోలింగ్ సరళిపై ఉదయం నుంచి ఆయా పార్టీల అభ్యర్థులు,నాయకులు, జనాల్లో ఉత్కంఠ నెలకొంది. ఆయా కేంద్రాల వద్దకు వెళ్లి ఆరా తీయడం కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ సరళిని నిశితంగా గమనించిన అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చే అవకాశం ఉంది..? ఎక్కడెక్కడ ఏ పార్టీకి అధిక ఓట్లు వచ్చే పరిస్థితి ఉంది..తదితర వివరాలపై ఆరా తీయడం కనిపించింది. ఇలా ఎవరికి వారు లెక్కలు వేసుకుంటూ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అప్పుడే ఆయా నియోజకవర్గాల్లో ఫలితాలపై విశ్లేషణలు చేయడం ప్రారంభమైంది. బయటి ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులు సైతం పోలింగ్ సరళి, గెలిచే పార్టీలు ఏవీ తదితర వాటిపై వివరాలు అడిగి తెలుసుకునేందుకు ఆసక్తి కనబర్చారు. మరోపక్క ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. జిల్లా ఉన్నతాధికారులతో పాటు పోలీసు ఉన్నతాధికారులు నిరంతరం పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. పోలింగ్ సరళిని కంట్రోల్ రూం నుంచి పరిశీలించారు.

దండేపల్లిలో ఓటేసేందుకు క్యూలో నిలబడ్డ యువతులు





ఇంద్రవెల్లిలో క్యూలో నిలబడ్డ మహిళా ఓటర్లు

పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయలేదని

ఎన్నికల బహిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడి సమస్యను త్వరలో పరిష్కరిస్తానని చెప్పినప్పటికీ వినలేదు. కలెక్టర్ గ్రామానికి వచ్చి హామీ ఇస్తేనే ఓట్లు వేస్తామని తెగేసి చెప్పారు. గ్రామానికి రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. గతంలో అనారోగ్యం బారిన పడి చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తీసుకుపోవడానికి 108 కూడా రాలేక ప్రాణాలు పోయిన సంఘటనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోసమే అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తుంటారు తప్ప తమ గోడును విన్న నాథుడే లేడని, అందుకే ఈసారి ఓటింగ్ బహిష్కరించాలని తీర్మానించుకున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. తహసీల్దార్, అధికారులు ఏమీ చేయలేక వెనుదిరిగారు.

బజార్‌హత్నూర్ : గ్రామానికి దశాబ్దాల తరబడి రోడ్డు, వంతెనలు లేక వర్షాకాలంలో బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని బోథ్ నియోజకవర్గంలోని బజార్‌హత్నూర్ మండలం కొత్తపల్లి గ్రామ ఆదివాసీ గిరిజనులు ఓటు వేయడానికి మొండికేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శంకర్, బజార్‌హత్నూర్ ఎస్ఐ బి.నరేష్ గ్రామానికి హుటాహుటిన చేరుకొని సమస్య పరిష్కారానికి యత్నించారు. కలెక్టర్‌కు గ్రామస్తుల సమస్య తెలుపగా కలెక్టర్ తాను ఎన్నికల అనంతరం గ్రామాన్ని సందర్శించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులు కలెక్టర్‌ను గ్రామానికి తీసుకొచ్చే బాధ్యత తీసుకోవాలని తహసీల్దార్‌ను పట్టుబట్టారు. కలెక్టర్‌ను తీసుకొచ్చే బాధ్యత తనదని కాగితం మీద రాత పూర్వకంగా గ్రామ పటేల్ రాయించుకొని పోలింగ్‌ను ప్రారంభించారు. 11.30గంటల ప్రాంతంలో పోలింగ్ ప్రారంభమైంది. అనంతరం గ్రామస్తులు మీడియాతో మాట్లాడుతూ అధికారులు ఒకవేళ ఇచ్చిన హామీ నెరవేర్చని ఎడల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతామని గ్రామస్తులు పేర్కొన్నారు.



ఓటు వేయబోమని నిరసన తెలుపుతున్న తాంసి మండలం గొల్లఘాట్ గ్రామస్తులు



బజార్‌హత్నూర్ మండలం కొత్తపల్లి ఆదివాసీ గిరిజనులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్ఐ

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిర్మల్
శుక్రవారం డిసెంబర్ 01, 2023

సోమార్‌పేట్‌లో ఈవీఎం మొరాయింపు

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని సోమార్‌పేట్ గ్రామంలో పంచాయతీలోని 183 బూత్‌లో ఈవీఎం మొరాయించింది. దీంతో రెండున్నర గంటలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. కొత్తగా ఏర్పాటు చేసిన ఈవీఎం కూడా వేగంగా పని చేయక ఎన్నికల సిబ్బంది, ఓటర్లు ఇబ్బంది పడ్డారు. ఈ బూత్ పరిధిలో 1077 మంది ఓటర్లు ఉండగా, ఈవీఎం సరిగా పనిచేయక సాయంత్రం మూడు గంటల వరకు కేవలం 350 మంది



ఓటర్లు మాత్రమే ఓటు వేశారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



నవతెలంగాణ-ముథోల్

ముథోల్ నియోజకవర్గంలో ప్రశాంతంగా గురువారం ఎన్నికలు ముగిశాయి. నియోజకవర్గం కేంద్రంమైన ముథోల్‌తో పాటు బాసర, తానూర్, లోకేశ్వరం, భైంసా, కుబీర్, కుంటాల మండలంలో ఉదయం తొమ్మిది గంటలకు 9.2 శాతంతో ప్రారంభమై పోలింగ్ సాయంత్రం వరకు సుమారు 70 శాతం వరకు పుంజుకుంది. ఓటర్లు ఉదయం, సాయంత్రం వరకు బారులు తీరి, ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఎప్పటికప్పుడు పోలీసులు గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రం వద్ద వైద్యశాఖ అధికారులు ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

ఓటు హక్కులో యువత ముందంజ..

ఈసారి యువతకు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు రావటంతో ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఓటు హక్కు వినియోగించిన తర్వాత పోలింగ్ కేంద్ర బయట సెల్ఫీలు దిగారు. సోషల్ మీడియాలో కూడా పెట్టారు.

కడెంలో....

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 36 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తం 36 పోలింగ్ కేంద్రాల్లో 79.7 పోలింగ్ శాతం నమోదు కాగా, మండలంలో 22వేల 537 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. అందులో పురుషులు 10వేల 528 తమ ఓటు వినియోగించుకోగా, మహిళలు 12వేల 9 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ సిబ్బంది తీరుపై బీజేపీ నాయకుల ఆగ్రహం

నవతెలంగాణ-కుభీర్

మండలకేంద్రమైన కుభీర్ ఉర్దూమిడియం పాఠశాలలో గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ సిబ్బందిగా వచ్చిన ఓవ్యక్తిపై ఇతర పార్టీ నాయకులు మండిపడ్డారు. దీంతో పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహించడానికి వచ్చిన సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన సదరు వ్యక్తి ఓటు వేయడానికి వచ్చిన వృద్ధురాలుకి ఉప్పర్ దాలో.. ఉప్పర్ దాలో.. అంటూ చెప్పడంతో పోలింగ్ స్టేషన్‌లో ఉన్న వేరే పార్టీ పోలింగ్ ఏజెంట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పక్కన ఉన్న ఇతర నాయకులు ఎన్నికల సిబ్బందిగా వచ్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పలు పార్టీ నాయకులు అధికారులకు తెలుపడంతో, వారు వచ్చి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తేలడంతో వారిని ఎన్నికల విధుల నుంచి తొలగించడం జరిగుతుందని అన్నారు. దీంతో ఇతర పార్టీ నాయకులు మళ్లీ యధావిధిగా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు.

ఎమ్మెల్యే హోదాలో చివరి సారి ఓటు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



ఎమ్మెల్యేగా రేఖానాయక్ ఓటు హక్కును వినియోగించుకోవడం ఇదే చివరి సారి, ఎమ్మెల్యే హోదాలో రేఖానాయక్ ఖానాపూర్‌లో రెండు పర్యాయాలు ఓటు వేశారు. కాని ఈ సారి ఆమెకు టికెట్ రాలేదు. దీంతో మరో అవకాశం లేక ఎమ్మెల్యేగా ఇదే ఆఖరి ఓటని పలువురు చర్చించుకున్నారు.

ఓటును వినియోగించుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు











నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ నియోజకవర్గంలో ఎన్నికల బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ ఓటు హక్కును గురువారం వినియోగించుకున్నారు. నిర్మల్ మండలం ఎల్లపల్లి గ్రామంలోని పోలింగ్ బూత్‌లో మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే నియోజకవర్గం అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తమ ఓటు హక్కును కుటుంబ సమేతంగా వినియోగించుకున్నారు. అలాగే బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి గాజులపేటలోని పంచాయతీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు మామడ మండలం దిమ్మదుర్తిలోని పోలింగ్ బూత్ లో వినియోగించుకున్నారు. ఇతర పార్టీలు, స్వతంత్రులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బోథ్ నియోజకవర్గంలో...

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు తమ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో భాగంగానే బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తన కుటుంబ సభ్యులతో కలిసి తన స్వగ్రామం రాజురాలోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా బోథ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడే గజేందర్ తన స్వగ్రామంలో బొందిడిలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కరెంట్ ఇస్తేనే ఓటు వేస్తాం

- ఎన్నికలను బహిష్కరించిన ఆదివాసీ గ్రామాల ప్రజలు
- రోడ్డుపై వంటా వార్పు
- సర్ది చెప్పిన అదనపు కలెక్టర్
- మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమైన పోలింగ్



నవతెలంగాణ-పెంబి, ఖానాపూర్‌టౌన్

తమ గ్రామాలకు కరెంట్ సౌకర్యం కల్పించే వరకు ఓట్లు వేయమని పేర్కొంటూ గురువారం ఆదివాసీలు ఎన్నికలను బహిష్కరించారు. మండలంలోని గుమ్మెన, ఎంగ్లాపూర్, నాయకపు గూడ, గ్రామాలకు చెందిన ప్రజలు మూకుమ్మడిగా ఎన్నికలను బహిష్కరించి, రోడ్డుపై వంటా వార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. సదరు గ్రామస్తులు తీసుకున్న నిర్ణయంతో ఎన్నికల సిబ్బంధి ఏమి చేయలేక పోలింగ్ స్టేషన్‌లో ఖాళీగా కుర్చున్నారు. ఎన్నికల సిబ్బంది ఎంత సర్ది చెప్పినా వినలేదు. సదరు గ్రామాల్లో కలిపి 420 మంది ఆదివాసీ ఓటర్లు ఉన్నారు. సదరు గ్రామాలకు ఏండ్ల నుంచి కరెంట్, రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. ప్రతిసారి ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని, గెలిచే నాయకులు అటు తర్వాత తమ గ్రామాలను పట్టించు కోనప్పుడు మేము ఎందుకు ఓట్లు వేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఎస్పీ వీరన్న, గిరిజను సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆదివాసీ, గిరిజనులు ఎన్నికల్లో పాల్గొన్నారు. పోలింగ్ మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభించారు.

సారంగాపూర్‌లో ప్రశాంతంగా పోలింగ్

నవతెలంగాణ-సారంగాపూర్

అసెంబ్లీ ఎన్నికలు నేపథ్యంలో గురువారం మండలంలో ప్రశాంతంగా పోలింగ్ కొనసాగింది. మండలంలో 32 గ్రామపంచాయతీల్లో 54 పోలింగ్ స్టేషన్ ఉండగా, 35 వేల 590 మంది ఓటర్లు ఉన్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, మధ్యాహ్నం వరకు 55శాతం పూర్తయింది. సాయంత్రం 3 గంటలకు 65శాతం, 4 గంటలకు 75 శాతం పూర్తి కాగా, 5 గంటలకు 80శాతం పూర్తి పోలింగ్ స్టేషన్ లోపల 5 గంటలలోపు గేటు లోపల ఉన్న ఓటర్లు ఉన్నంటు మరో 10 శాతం పెరిగే అవకాశాలు ఉన్నాయని అసిస్టేంట్ రిటర్నింగ్ అధికారి శ్రీదేవి తెలిపారు. మండల కేంద్రంలో 18వ పోలింగ్ స్టేషన్‌లో మందకొడిగా పోలింగ్ సరళి 75శాతం పూర్తయింది. 16 వ పోలిగ్ స్టేషన్‌లో 70 శాతం పూర్తయింది. ఈ ఎన్నికల్లో ఓటు వేసేందుకు యువత ఉత్సహాన్ని చూపింది.



ఓటు వేశారు.. ఆదర్శంగా నిలిచారు

● తొలి ఓటర్లలో సంతోషం ● సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన దంపతులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. జిల్లాలో 592 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఓటర్లు తమ పోలింగ్ బూత్‌కి వెళ్లి ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీగా బందోబస్తు చేపట్టారు. కాగా ఆదిలాబాద్ జర్నలిస్టులు తమ ఓటు హక్కును వినియోగించుకొని ఆదర్శంగా నిలిచారు. ఇదిలా ఉంటే తొలిసారి ఓటేస్తున్న యువత, ఇతర ప్రాంతాల్లో ఉంటూ ఓటు వినియోగించుకునేందుకు ఇక్కడి వచ్చి ఇతరులకు ఆదర్శంగా ఉంటున్నారు. అదే విధంగా వృద్దులు కూడా తమ ఓటును వేసి పలువురికి అవగాహన కల్పించారు.

ఓటేసిన శతాధిక వద్ధురాలు



నేను కూడా ఓటేస్తాను అంటూ 100 సంవత్సరాల వృద్ధురాలు ముందుగా వచ్చి పలువురికి ఆదర్శంగా నిలిచింది. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మామిడి కూడా గ్రామానికి చెందిన మెస్రం రాంబాయి ఓటును వినియోగించుకునేందుకు గ్రామంలోని తమ పోలింగ్ బూత్‌కు వెళ్ళింది. నడవలేని స్థితిలో ఉన్న ఆ వృద్ధురాలికి ఏజెంట్లు వీల్‌చైర్ సహాయంతో పోలింగ్ కేంద్రంలో తీసికెళ్ళి దగ్గరుండి ఓటేయించారు.

ప్రతి సారి వచ్చి ఓటేస్తాం..

సూర్యకాంత్, నవీన దంపతులు



మాది ఆదిలాబాద్ జిల్లా కేంద్రం, కానీ వ్యక్తిగత కారణాలతో మేము నిర్మల్ పట్టణంలో నివాసిస్తుంటాం. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి మేము ఆదిలాబాద్‌కు వచ్చి ఓటు హక్కును వినియోగించుకుంటాము. ఏ పరిస్థితిలో ఉన్న తప్పకుండా వచ్చి మేము ఓటేస్తాము. ప్రజాస్వామ్యంలో ఓటేయడం చాలా ముఖ్యం. ప్రతి ఒక్కరు కూడా తమ ఓటు హక్కును ఎన్నికల సమయంలో వినియోగించుకోవాలి. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఒక నాయకుడికి ఓటేశాం.

మొదటిసారి ఓటేయడం సంతోషంగా ఉంది

గాజరి కళ్యాణి (పిట్టలవాడ)



మొట్టమొదటి సారిగా ఓటు వేయడం నాకు సంతోషంగా ఉంది. ఐదేళ్ల కోసారి వచ్చే ఎన్నికల కోసం ఓటు హక్కు వచ్చినప్పటికీ నుండి ఓటేయడానికి ఎదురు చూశాను. అందరూ ఓటు వేయడం చూసి ఓట్ల పండుగ లాగా అనిపించింది. మళ్ళీ ఏ ఎన్నికలు జరిగిన తప్పకుండా నేను నా ఓటు హక్కును వినియోగించుకుంటాను. నేను ఓటు వేశాక పలువురితో ఈ విషయాన్ని పంచుకోవడం సంతోషకారంగా అనిపించింది.

తొలిసారి ఓటు వేయడం సంతోషంగా ఉంది



తలమడుగు: మండల కేంద్రానికి చెందిన మయూరి మొదటి సారిగా తన ఓటు వేయడం సంతోషంగా ఉందన్నారు. గురువారం నియోజకవర్గ శాసనసభ ఎన్నికల్లో మొట్టమొదటిసారిగా తమ ఓటు హక్కును వినియోగించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తొలిసారి ఓటు హక్కును ఏ విధంగా వినియోగించుకోవాలో అర్థమైనట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ ఈవీఎంల ద్వారా ప్రతి ఒక్కరు ఓటు వినియోగించుకోవాలని యువతను కోరారు.

ఓటేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు



దీపాయిగూడలో ఓటు వేసిన ఎమ్మెల్యే రామన్న



కుటుంబ సభ్యులతో కలిసి ఓటేసిన బీజేపీ అభ్యర్థి శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు కుటుంబ సమేతంగా వెళ్లి ఓటును వేశారు. సాధారణ ప్రజలతో కలిసి వారు కూడ క్యూ లైన్లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. జైనథ్ మండలంలోని దీపాయిగూడలో ఎమ్మెల్యే జోగు రామన్న తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా బీజేపీ అభ్యర్థి పాయల శంకర్ శాంతినగర్‌లోని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 281 పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు మద్దతు తెలుపుతున్నారన్నారు. భారీ మెజార్టీతో గెలిచే అవకాశాలున్నాయని ధీమా వ్యక్తం చేశారు. అదే విదంగా ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా వచ్చి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకుంటున్నారన్నారు. మరో పక్క కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్ రెడ్డి తన సతిమణి సాయిమౌన రెడ్డితో కలిసి కొలాం ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన 177 పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.అనంతరం వారు ఆయా పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించి పోలింగ్ ఏజెంట్లు, ఎన్నికల అధికారులతో మాట్లాడారు.

పోలింగ్ స్టేషన్లను సందర్శించిన బీఆర్ఎస్ అభ్యర్థి ..

తలమడుగు : నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ గురువారం పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ బూత్లను పరిశీలించారు. మర్యాద పూర్వకంగా ఓటర్లను కలుస్తూ ఎన్నికల తీరు పర్యవేక్షించారు.



సతిమణితో కలిసి ఓటేసిన కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి మాట్లాడుతున్న అనిల్ జాదవ్

దుబాయి నుంచి వచ్చి ఓటేసి..



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు దుబాయి నుంచి పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సయ్యద్ మహెబుబ్ అలీ వచ్చారు. తన ఓటు హక్కు వినియోగించుకునేందుకు సొంత ఖర్చులతో దుబాయిలోని కువైట్ నుంచి వచ్చారు. డిసెంబర్ 2వ తేదిన రిటర్న్ ఫ్లైట్ ఉంది. 15 సంవత్సరాలుగా ఆయన కువైట్‌లోనే పని చేస్తున్నారు. ప్రతి సారి ఎన్నికల సమయంలో వచ్చి తన ఓటు వినియోగించుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉదయం 7.30 నిమిషాలకు హైదరాబాద్‌కు చేరుకొని అక్కడి నుంచి కారులో ఆదిలాబాద్‌కు వచ్చి తన ఓటును వేశారు. ప్రతి ఒక్కరు తమ ఓటును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరుతున్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు



నార్నూర్‌లో బారులు తీరిన ఓటర్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని 34 గ్రామపంచాయతీలలో ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయి. బూతుల వద్ద ఓటర్లు బారులు తీరారు. వృద్ధులు, దివ్యాంగులు రిక్షాల్లో వచ్చి ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి అగ్గిమల్ల గణేష్ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. పోచ్చర గ్రామంలో అల్లూరి సంజీవరెడ్డి ఓటు వేశారు.

పోలింగ్ బూతుల వద్ద ఏర్పాట్లు...

మండలంలోని ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లు చేశారు. కేంద్రాల్లో ఓటరు వెంట సెల్ ఫోన్‌కూడా అనుమతించలేదు. మండలంలోని కచ్‌కంటి, బంగారుగూడ, అనుకుంట పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉదయం నుంచే ఓటేసేందుకు జనాలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

ఇంద్రవెల్లి : ఖానాపూర్ నియోజక శాసనసభ ఎన్నికల్లో మండలంలో 80.93 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. మండలంలో మొత్తం 48 పోలింగ్ కేంద్రాల్లో 30 వేల పైచిలుకు ఓట్లకు గాను 22,725 ఓటింగ్ నమోదైంది. మొదటి సారి భారీ మొత్తంలో పోలింగ్ శాతం 80.93 శాతం నమోదైనట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

తలమడుగు : బోథ్ నియోజకవర్గ శాసనసభ ఎన్నికల్లో 11 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా గత కొద్ది నెలల నుండి ఉత్కంఠంగా సాగిన ప్రచారంలో వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొని పోటాపోటీగా ప్రచారాలు నిర్వహించారు. గురువారం మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్ర శాంతంగా ఎన్నికలు ముగిసాయి. ఎస్సై ధనశ్రీ పర్యవేక్షణలో బందోబస్తు ప్రక్రియను నిర్వహించారు. ఉదయం నుంచే ప్రజలు బారులు తీరి వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బేల : మండలంలో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం 7 గంటల నుండే పోలింగ్ మొదలైంది. మండలంలో 41 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం 30629 మంది ఓటర్లు ఉన్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా కొబ్బాయి గ్రామంలో పోలింగ్ బూత్‌లో ఈవీఎం మోరాయించడంతో గంట ఆలస్యం అయింది.

నార్నూర్ : నార్నూర్, గాదిగూడ మండలాల్లోని 51 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సజావుగా సాగింది. 80 శాతం పైన ఓటు హక్కును ఓటర్లు వినియోగించుకునట్టు అదికారులు తెలిపారు. మరప్పగూడ, తాడిహత్నూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఈవీఎం మోరాయించడంతో మహిళలు, వృద్దులు ఓటర్లు క్యూలో నిలబడి గంటల తరబడి ఇబ్బంది పడ్డారు. అధికారులు వాటిని గమనించి అప్పటికప్పుడు పరిష్కరించారు. ఇదిలా ఉంటే 18 ఏళ్ల నిండిన యువత ఖుషి ఖుషిగా తమ మొదటి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఘటనకు జరగకుండా ఎస్సైలు రవికిరణ్, మహేష్ బందోబస్తు చేపట్టారు.

బజార్హత్నూర్ : మండలంలో ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ఉదయం మందకొడిగా మొదలైన పోలింగ్ 9 గంటలకు ఊపందుకుంది. వృద్ధులు, వికలాంగులు మండల పరిధిలో మొత్తం 37 పోలింగ్ కేంద్రాలలో బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకోగా మొదటి సారి ఓటు హక్కును యువకులు వినియోగించుకున్నారు. బోథ్ నియోజకవర్గంలో సాయంత్రం 5 గంటల వరకు 75.3 శాతం పోలింగ్ నమోదు అయింది.



బేలలో ఓటేసేందుకు క్యూ కట్టిన మహిళలు

బారులు తీరిన ఓటర్లు.. తగ్గిన ఓటింగ్ శాతం

- గతం కంటే పడిపోయిన ఓటింగ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలు ఇంకా గుర్తించకపోవడంతో గతంతో పోల్చుకుంటే ఓటింగ్ శాతం తగ్గింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జరుగుతున్న మూడో ఎన్నికల్లో వరుసగా ఓటింగ్ శాతం పడిపోయింది. 2014 ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గంలో 81.49 శాతం ఉండగా 2018లో 78.09 శాతం నమోదు కాగా ప్రస్తుత ఎన్నికల్లో ఈ శాతం కాస్త 71.18గా నమోదైంది. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 2014 ఎన్నికల్లో 76.21 శాతం ఓటింగ్ నమోదు కాగా 2018 ఎన్నికల్లో 78.88 శాతం నమోదు కాగా ప్రస్తుత ఎన్నికల్లో 72.08శాతం నమోదైంది. అధికారులు సామాజిక మాధ్యమాలతో పాటు ఇతర అన్ని రకాల మాధ్యమాలను ఉపయోగించుకొని ఓటర్లలో అవగాహన కల్పించడానికి ప్రయత్నాలు చేసినప్పటికీ జిల్లాలో గతంతో పోల్చుకుంటే రెండు నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం తగ్గింది. ఎమ్మెల్యే ఎన్నికల్లో భాగంగా ఆసిఫాబాద్‌లో కలెక్టర్ బోర్కడే హేమంత్ తన సతీమణితో కలిసి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎస్పీ సురేష్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి శ్యాంనాయక్, బిఆర్ఎస్ నేత సరస్వతితో పాటు పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కొన్ని చోట్ల సౌకర్యాలు కరువు

జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రాల్లో క్యూలో నిలబడే ఓటర్లకు టెంట్లు ఏర్పాటు చేయలేదు. మండలంలోని బాబాపూర్ పోలింగ్ కేంద్రంలో కనీసం టెంటు కూడా వేయకపోవడంతో ఓటర్లు గంటల తరబడి ఎండలో నిలబడాల్సి వచ్చింది. తుంపల్లిలో కూడా ఇదే పరిస్థితి కనిపించింది.

పోలింగ్ కేంద్రానికి ఇద్దరే భద్రత సిబ్బంది

ఆసిఫాబాద్ మండలంలోని కొన్ని పోలింగ్ కేంద్రాలలో భద్రత సిబ్బంది ఇద్దరే ఉండడంతో కొంత ఇబ్బంది పరిస్థితులు తలెత్తాయి. జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలలో ఎక్కువ మంది ఓటర్లు ఉండి తక్కువ మంది భద్రతా సిబ్బంది ఉండడంతో ఘర్షణ వాతావరణం తలెత్తింది. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఇద్దరు మాత్రమే భద్రత సిబ్బంది ఉండడంతో ఒకరు గేటు వద్ద మరొకరు బయట ఓటర్లను సవరించడం లాంటివి చేశారు.

జిల్లా కేంద్రంలో చెదురుమదురు ఘటనలు

జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి బీఆర్ఎస్ నాయకులు చేరుకొని ప్రచారం చేస్తున్నారని సమాచారంతో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు విశ్వప్రసాద్ అక్కడికి చేరుకొని వారించే ప్రయత్నం చేశారు. దీనికి వారి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని పంపించేశారు. ఉర్దూ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్ర సందర్శనకు అభ్యర్థి కోవ లక్ష్మి రావడంతో ఆమెతోపాటు శ్రేణులు కొంతమంది పోలింగ్ కేంద్రానికి వచ్చే ప్రయత్నం చేయడంతో కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం చెప్పారు. దీంతో పోలీసులు వారందరినీ పంపించి వేశారు.

ఉదయం నుండి బారులు తీరిన ఓటర్లు

జిల్లా కేంద్రంతో పాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఉదయం ఏడు గంటల నుండి ఓటర్లు పెద్ద ఎత్తున చేరుకున్నారు. సాయంత్రం నాలుగు గంటల వరకు అనుమతి ఉండడంతో ఆ లోపు ఓటు వేయాలనే ఆతృత ఓటర్లలో కనిపించింది. కొన్నిచోట్ల పోలీస్ సిబ్బంది వృద్ధులను వీల్ చైర్లలో తీసుకుని వెళ్లి ఓట్లు వేయించడం కనిపించింది. ఆదర్శ పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ కౌంటర్‌లో పలువురు సెల్ఫీలు దిగడం కనిపించింది.



పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు

ఖానాపూర్‌లో ఆలస్యమైనా కొనసాగిన పోలింగ్

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



పట్టణంలోని ఖానాపూర్ 187, 188 పోలింగ్ కేంద్రాల్లో ఐదు గంటల సమయం దాటిన తర్వాత కూడా పోలింగ్ కొన్ని గంటల వరకు కొనసాగింది. సమస్యాత్మక పోలింగ్ కేంద్రం అయినప్పటికీ అధికారుల పర్యవేక్షణ కొరవడి పోలింగ్ నిదానంగా సాగింది. బారులు తీరిన ఓటర్లతో పోలింగ్ కేంద్రం కిక్కిరిసింది. ఓటర్లకు సరైన సదుపాయాలు కల్పించడంలో ఎన్నికల సిబ్బంది విఫలమయ్యారు. కొన్ని గంటల పాటు వేచి ఉన్న ఓటర్లకు టోకెన్లు ఇచ్చి ఓటింగ్‌లో పాల్గొనాలని సిబ్బంది సూచించినప్పటికీ గంటల పాటు నిరీక్షించడంతో ఓటర్లు అసహనానికి గురయ్యారు. ఓటింగ్ సమయం ముగిసే సరికి ఒక్కసారిగా తరలివచ్చిన ఓటర్లను నియంత్రించడానికి పోలీసులు తలలు పట్టుకున్నారు. తమకు ఓటు వేసే అవకాశాన్ని కల్పించాలని ఓటర్లు పెద్ద ఎత్తున నినదించడంతో కొంతసేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది .విషయం తెలుసుకుని పోలింగ్ కేంద్రానికి జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి చేరుకోవడంతో ఆందోళన సద్దుమణిగింది. సౌకర్యాల లేమితో ఓటర్లు ఇబ్బందిపడి ఎట్టకేలకు తమ ఓటు హక్కును వినియోగించుకొని వెనుతిరిగారు.

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి..

ఖానాపూర్‌లోని 187, 188 పోలింగ్ కేంద్రాలను కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకుని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ముధోల్‌లో 80 శాతం పోలింగ్

నవతెలంగాణ-ముధోల్

ముధోల్ నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో 80.34 శాతం పోలింగ్ నమోదైంది. ముధోల్ నియోజకవర్గంలో మొత్తం 2,49,554 ఓటర్లు ఉన్నారు. ఇందులో ముధోల్ మండలంలోని 23,281, కుభీర్ 32,477, కుంటాల 15,644, నర్సాపూర్ 7,318, భైంసా 57,115, లోకేశ్వరం 24,145, బాసర 12879, తానూర్ 27,247 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 2,00,486 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఖానాపూర్‌లో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఖానాపూర్ పట్టణంతో పాటు మండలం మొత్తం 50 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణ కేంద్రంతో పాటు దిలావర్‌పూర్, మస్కాపూర్, సుర్జాపూర్, బాదన్ కుర్తి, తర్లపాడు, సత్తెనపల్లి, పాత ఎల్లాపూర్, రాజురా, బీర్‌నంది, రంగపేట , ఏర్వచింతల్ (సోమార్పేట్) బావాపూర్(కె), బావాపూర్(ఆర్) గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి 7 గంటలకు ముగిసింది. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద జనాలు బారులు తీరారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు నూతనంగా ఓటు అర్హత పొందిన యువత ఓటు వేయడానికి ఉత్సాహంగా వచ్చారు. వృద్ధులు ఉదయన్నే పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ తమ ఓటు హక్కులను వినియోగించుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని 235 బూత్‌లో ఈవీఎం మోరాయించడంతో గంటన్నర ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఏర్వచింతల్ గ్రామంలో సైతం ఈవీఎం మోరాయించడంతో ఉదయం 8:30కు పోలింగ్ ప్రారంభమైంది. ఖానాపూర్‌లోని వడ్డెవాడ బూత్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి బుక్య జాన్సన్ నాయక్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్యే రేఖా నాయక్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు, బీజేపీ నాయకుని మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులు వికలాంగుల కోసం వీల్ చైర్లను ఏర్పాటు చేశారు. ఖానాపూర్ మండలం మొత్తం 75.53 శాతం ఓటు నమోదు అయింది. ఖానాపూర్ మండలంలో పురుష ఓట్లు 13843లు నమోదు కాగా 16580 మహిళల ఓట్లు నమోదు అయ్యాయి. కాగా రాత్రి 7 గంటల వరకు పోలింగ్ ముగిసింది. ఖానాపూర్ నియోజకవర్గం మొత్తం 77.46 శాతం నమోదైంది.

బీఎల్ఓలు, ఆరోగ్య సిబ్బందిపై ఎన్నికల అధికారుల నిర్లక్ష్యం

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్ర సమీపంలో బీఎల్వోలు, ఆరోగ్య సిబ్బందికి ఎలాంటి సౌకర్యాలు, వసతులు కల్పించకపోవడంతో పోలీస్ కేంద్రాలకు దూరంగా విధులు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ రోజు ప్రధాన పాత్ర వహించే బీఎల్ఓలు, ఆరోగ్య సిబ్బందిపై ఎన్నిక అధికారులు నిర్లక్ష్యం వహించారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో లేదా పోలింగ్ కేంద్రాల మైదానంలో వారికి పలు చోట్ల టెంట్లు, కనీస సౌకర్యాలు, వసతులు కల్పించకుండా చేశారు. దీంతో పోలింగ్ కేంద్రాలకు దూరంగా రహదారులపై ప్రక్కన, చెట్ల కింద, పలు వ్యాపార సముదాయాల ముందు కూర్చొని విధులు నిర్వహించారు. సమయానికి సైతం నీళ్ల, భోజనాలు స్నాక్స్ వంటి అందజేయక పోవడంతో వీరు నిరాశకు గురయ్యారు. గతంలో తమకంటూ ప్రత్యేక స్థానం కల్పించే వారని, పోలింగ్ సమీపంలోనే ఓ చోట సముచిత స్థానం కల్పించే వారని, ప్రస్తుతం ఎటువంటి సౌకర్యం కల్పించకపోవడంతో నిరాశకు లోనయ్యారు. అలాగే పోలింగ్ కేంద్రం సమీపంలో వీరు లేకపోవడంతో కొంత మేర ఓటర్లు తమ పోలింగ్ బూత్ నంబర్లు, స్లీప్‌లు తెలవక తికమక చెందడం గమనార్హం.



ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో దుకాణాల వద్ద కూర్చున్న బీఎల్ఓలు

రాత్రి వరకు కొనసాగిన పోలింగ్

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని పలు కేంద్రాల్లో గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రాత్రి వరకు కొనసాగింది. మండలంలో మొత్తం 37 పోలింగ్ కేంద్రాలు ఉండగా 25,992 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని మండలకేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప, బీఎస్పీ అభ్యర్థి ప్రవీన్‌కుమార్ పరిశీలించారు. మండలంలో పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై సనత్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నానికి ఊపందుకొని రాత్రి వరకు కొనసాగింది.



బతికుండగానే చంపింద్రు



కౌటాల : మండలంలోని గుడ్లబోరి గ్రామానికి చెందిన శివార్కర్ భాస్కర్ ఓటరు లిస్టులో పేరు వచ్చినప్పటికీ పోలింగ్ బూత్ నెంబర్ 174లోని ఎన్నికల అధికారుల వద్ద ఉన్నటువంటి డెప్యూ లిస్టులో అతని పేరు ఉండడంతో రిటర్నింగ్ అధికారి ఓటు వేయకుండా అడ్డుకున్నాడు. దీంతో బాధితుడు తాను బ్రతికుండగానే ఎలా చంపుతారని, డెప్యూ లిస్టులో నా పేరు ఎలా వస్తుందని అధికారులను నిలదీషారు. అయిన్నప్పటికీ డెప్యూ లిస్టులో ఉన్నదాని ప్రకారమే ఓటు వేసే అవకాశం కల్పిస్తామని, లేనిచో ఓటు వేసేందుకు అంగీకరించమని ఎన్నికల అధికారులు తెలిపారు. దీంతో బాధితుడు అధికారుల నిర్లక్ష్యం వల్లనే తన ఓటు హక్కును కోల్పోవాల్సి వస్తుందని బాధితుడు ఆవేధన వ్యక్తం చేశారు.

ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో వివిధ పార్టీల నుండి బరిలో ఉన్న అభ్యర్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మి తిర్యాని మండలంలో ఓటు హక్కు వినియోగించుకోగా, కాంగ్రెస్ అభ్యర్థి శ్యాంనాయక్ జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాలలో, బీజేపీ అభ్యర్థి ఆత్మారాం నాయక్ గోలేటిలో, బీఎంపీ అభ్యర్థి బుక్య పల్లవి గోలేటిలో బీజేపీ రెబల్ స్వతంత్ర్య అభ్యర్థి కొట్నాక విజయ్ వాంకిడి మండలం ఇందానిలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఓటు వేసిన అనంతరం జిల్లా కేంద్రాలు తన సోదరి సరస్వతితో కలిసి ఓటింగ్ సరళి పర్యవేక్షించారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా భారీ ఎత్తున పోలీసు బందోబస్తు నిర్వహించినట్టు సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ తెలిపారు. వాంకిడి, ఇందాని గ్రామాల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటర్లు బారులుతీరారు. ఏ బూత్‌లో కూడా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయి.

సిర్పూర్(టి) : రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ మండలంలో మొత్తం ఓటర్లు 21,878 మంది ఉండగా వీరిలో పురుషులు 10926, మహిళలు 10952 మంది ఓటర్లు ఉన్నారు. మండలంలో 30 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు, పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

జిల్లా కేంద్రాన్ని కమ్ముకున్న మేఘాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ చిత్రాన్ని చూడగానే కాశ్మీర్ కళ్ళ ముందు కనిపిస్తుంది కానీ అదేది కాదు. గురువారం జిల్లా కేంద్రాన్ని మంచి మేఘాలు కమ్ముకున్నాయి. ఎదుటి నుండి వచ్చే వ్యక్తి వాహనాలు కనిపించకుండా మంచు మేఘాలు కమ్ముకోవడంతో కొంత ఇబ్బంది పడ్డారు. అయినప్పటికీ పొగ మంచు కొత్త అందాలను చూపడంతో పట్టణవాసులు ఆ అందాలను ఆస్వాదించారు. చలికాలంలో ఇతర ప్రాంతాలతో పోల్చితే జిల్లాలో చలి ఎక్కువగా ఉంటుంది.

ఈవీఎంల మొరాయింపు..ఇబ్బందులు పడ్డ ఓటర్లు

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని బెజ్జూరు, రెబ్బెన పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఏడు గంటలకు ఓటింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా ఏజెంట్ల నియామకం, ఈవీఎంల సర్దుబాటు తదితర కారణాలతో 20 నిమిషాలు ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభమైంది. దీంతో ఓటర్లు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. బెజ్జూరులోని 216, 218, రెబ్బెనలోని 324 ఈవీఎంలు మొరాయించడంతో రెండు గంటల పాటు ఓటింగ్ నిలిచిపోయింది. ఎన్నికల అధికారులు ఈవీఎంలు మార్చడంతో ఓటింగ్ ప్రారంభమైనప్పటికీ మందకొడిగా సాగింది. ఒక్కో ఈవీఎం కొద్దిసేపటి వరకు మరో బ్యాలెట్ రాకపోవడంతో సమయం ఎక్కువైంది. బెజ్జూరులోని 216, 218, 219 బూతుల్లో పోలింగ్ సమయం ముగిసే నాటికి సుమారు 1500 మంది ఓటర్లు క్యూలైన్‌లో నిలబడ్డారు. క్యూలైన్‌లో ఉన్నవారందరికి ఓటు హక్కు కల్పిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు. కాగా రెబ్బెనలో బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్‌బాబు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాలుగు గంటల వరకు 65 శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. వృద్ధులు, వికలాంగులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చారు. మహిళలు, యువత ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఆసక్తి చూపారు. మండలంలో సుమారు 26 వేల మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ బూత్‌లను బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప, బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్‌బాబు పరిశీలించారు. మందకొడిగా ఓటింగ్ సాగడంపై, ఈవీఎంలు మొరాయింపుపై బీఆర్ఎస్ అభ్యర్థి కోనప్ప కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.



బెజ్జూర్‌లో ఈవీఎంలు మొరాయించడంతో రెండు గంటల పాటు వేచి చూస్తున్న ఓటర్లు

కౌటాల : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గురువారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభం కావల్సిన పోలింగ్ ప్రక్రియ మండలంలోని గుడ్లబోరిలో 7:26, తమ్డిహెట్టిలో 7:38 గంటలకు ప్రారంభం అయింది. ఎందుకని వివరణ కోరగా ఈవీఎంలు ఓపెన్ కాకపోవడంతో ఆలస్యమైనట్టు వారు పేర్కొన్నారు. మండలంలోని విజయనగరంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాలా ఆలస్యం చేయడంతో సిబ్బంది సైతం చురుకుగా లేకపోవడంతో చాలామంది ఓటు వేయకుండానే వెనుదిరిగారు. గుండాయిపేట్ పోలింగ్ బూత్‌లో చిన్నపాటి గొడవ కాగా పోలిస్ సిబ్బంది అడ్డుకొని అదుపులోకి తీసుకొచ్చారు. ఈవీఎంలు ఆలస్యంగా ఓపెన్ కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభమై మూడు గంటల వరకు 50 శాతం దాటని సంఘటనలు చోటుచేసుకున్నాయి. సీఐ సాదిక్‌పాషా ఎలాంటి సంఘటనలు జరుగకుండా ముందస్తు పోలిస్ ప్రొటెక్షన్ కల్పించినప్పటికీ అక్కడక్కడ చిన్నచిన్న ఘర్షణలు చోటు చేసుకున్నాయి.



కౌటాలలో ఈవీఎంలు మొరాయించడంతో నిరీక్షిస్తున్న ఓటర్లు

మండలంలో ప్రశాంతంగా అసెంబ్లీ ఎన్నికలు



ఆసిఫాబాద్ : జైనూర్ మండలంలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం మండలవ్యాప్తంగా 32 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రశాంతంగా ఎన్నికల అధికారులు ఎన్నికలను నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో మహిళలు ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఆసక్తి చూపారు. మండలవ్యాప్తంగా మొత్తం 23,893 మంది ఓటర్లు ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జైనూర్ సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. కాగా మండలవ్యాప్తంగా ఓటింగ్ నమోదు శాతం తెలపడానికి జిల్లా అధికారుల నుండి అనుమతిలేదని అధికారులు చెపుతున్నారు. జిల్లాకేంద్రం నుంచి వచ్చిన ప్రకటన తర్వాతనే మండలవారీగా పోలింగ్ శాతం తెలియనుంది.

నూతనోత్సాహంతో ఓటు హక్కు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో తొలిసారి ఓటు హక్కు వచ్చిన యువతీ, యువకులు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నూతన ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన యువకులు తమ అనుభూతిని వ్యక్త పరిచారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 16,555 మంది నూతన ఓటర్లు తమ ఓటు కోసం నమోదు చేసుకున్నారు. వీరిలో కొంతమంది తమ అభిప్రాయాలను తెలియజేశారు.

ఓటు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది

లక్ష్మీప్రియ, ఆసిఫాబాద్



మొదటిసారి ఓటు వేయడం సంతోషంగా ఉంది. డాక్టర్ చదువుతున్న నేను ఓటు కోసం ఇంటికి వచ్చాను. ప్రతిసారి ఎన్నికలు వచ్చినప్పుడు చూస్తూ ఉన్న నేను మొదటిసారి ఓటు వేయడం ఒక గొప్ప అనుభూతిని పొందాను.

సరైన నాయకులను ఎన్నుకోవాలి

చాపిడి ఆకాంక్ష, సాలెగూడ



యువత చేతుల్లో రాష్ట్రం దేశం భవితవ్యం ఉంటుంది. సరైన నాయకుల్ని ఎంచుకోవడంలో యువత ప్రథమ పాత్ర పోషించాలి. నాయకుల ఎంపికలో ఆచితూచి అడిగేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. బీఈడీ కోచింగ్ నుంచి ప్రస్తుతం ఓటు వేయడానికి వచ్చాను. ఏది ఏమైనా మొదటిసారి వేసిన ఓటును మర్చిపోలేను.

ఓటు హక్కు విలువ వెలకట్టలేనిది

మసడే నాగలక్ష్మి, జెండాగూడ



నేను సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ఆదిలాబాద్‌లో డిగ్రీ చదువుతున్నాను. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువ వెలకట్టలేనిది. ప్రతి వ్యక్తి ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఓటును అమ్ముకోకుండా నిజాయితీగా వేసి ఉత్తమమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి.

నవతెలంగాణ
మంచిర్యాల
శుక్రవారం డిసెంబర్ 01, 2023

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

మందమర్రి : చెన్నూరు నియోజకవర్గంలో 74 శాతంతో ప్రశాంతంగా పోలింగ్ ముగిసిందని మందమర్రి మండల తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. చెన్నూరు నియోజకవర్గం మందమర్రి పట్టణంలో గురువారం ఉదయం అన్నీ పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ తర్వాత 7 గంటలకు పోలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించామని అధికారులు తెలిపారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో సాయంత్రం 4 గంటల వరకు క్యూ లైన్‌లో ఉన్న వారికి మాత్రమే ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. నియోజకవర్గంలో 74 శాతం పోలింగ్ జరిగినట్లు తెలిపారు. నియోజకవర్గంలో గుర్తింపు పొందిన 4 ముఖ్య పార్టీలతో సహా రిజిస్టర్ అయ్యి గుర్తింపు పొందని 7 పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు 3 గురు కలిసి మొత్తం 14 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

పోలింగ్ రోజు కూడా ప్రలోభాలు

- పోలింగ్ కేంద్రాల్లో ప్రచారం
- చూసీచూడనట్లు వ్యవహరించిన పోలీసులు

నవతెలంగాణ-దండేపల్లి

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో మందకోడిగా ప్రారంభమైన పోలింగ్ జోరుగా సాగింది. ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ వివిధ పార్టీల నాయకులు ఓటును అభ్యర్థిస్తు కనిపించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉంటూ తమ పార్టీలకు ఓటు వేయాలని పోలింగ్ కేంద్రాల లోపలికి వెళ్లి మరి చెబుతున్నారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ ఉన్నా కూడా ఎవరూ లెక్క చేయడం లేదు. ఇదంతా పోలీస్ సిబ్బంది ముందే జరుగుతున్న చూసి చూడనట్లు వ్యవహరించారు.



పొన్కల్‌లో ఓటు వినియోగించుకున్న బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి

నవతెలంగాణ-జన్నారం

మండలం పొన్కల్ గ్రామపంచాయతీ పోలింగ్ బూత్ 281లో బీఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బన్సీలాల్ రాథోడ్, దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కు అనేది వజ్రాయుధం లాంటిదని ప్రతి ఒక్కరు ఓటు వినియోగించుకోవాలని సరైన నాయకున్ని ఎన్నుకోవాలని సూచించారు.



పోలింగ్‌ను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-నస్పూర్

శాసనసభ నియోజకవర్గాల సాధారణ ఎన్నికలు గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రశాంతంగా జరిగాయని ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సీసీ టీవీ సర్వేయలెన్స్, జీపీఎస్ సర్వేయలెన్స్, జిల్లా కంట్రోల్ రూమ్, వెబ్ కాస్టింగ్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ సెల్, సోషల్ మీడియా సెల్ లను చెన్నూర్ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకులు సజ్జన్ ఆర్, డీసీపీ సుధీర్ రామ్నాథ్ కేకన్లతో కలిసి పరిశీలించారు. జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాలలో 743 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ జరుగుతున్న తీరును వెబ్కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించడంతో పాటు ఆయా పోలింగ్ కేంద్రాలో తీసుకోవలసిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, ఆయా విభాగాల నిర్వాహకులు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- ఎన్నికల సిబ్బందితో వివరాలు తెలుసుకున్న కలెక్టర్ బదావత్ సంతోష్



ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్

సాధారణ ఎన్నికలలో భాగంగా జిల్లాలోని మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో గల నస్పూర్ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన 218 పోలింగ్ కేంద్రంలో సతీమణి పల్లవితో కలిసి జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

జన్నారంలో పోలింగ్ ప్రశాంతం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని 29 గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన 54 పోలిక కేంద్రాల్లో గురువారం నిర్వహిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని రాంపూర్ రోటి గూడ పోన్కల్ గ్రామాలలో ఉన్న మూడు పోలింగ్ కేంద్రాలలో ఉదయం ఈవీఎంలు మొరారించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. అలాగే తపాలాపూర్ గ్రామంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ఒక పోలింగ్ కేంద్రంలో ఎక్కువ ఓటర్లు ఉండడంతో ఓటర్లు చిరాకు పడుతూ ఓటు వేయమని వెనుతిరిగి పోయారు. జన్నారం పట్టణ కేంద్రంలో ఉర్దూ పాఠశాలలో ఓటర్లకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఎండకు వృద్ధులలు మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు దీరిన జనం, ఓటర్లు సాయంత్రం ఐదు గంటల వరకు కూడా వరుసలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



రాంపూర్‌లో మొరాయించిన ఈవీఎం

మండలంలోని రాంపూర్ గ్రామంలో ఈవీఎం మొరాయించింది. గురువారం ఉదయం రాంపూర్ గ్రామంలో 2 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో ఒక పోలింగ్ కేంద్రంలో ఈవీఎం రాయించడంతో, నిపుణులు వచ్చి ఆ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంను సరి చేస్తున్నారు. దీంతో ఆ గ్రామంలో పోలింగ్ కొంత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

మండలంలో ప్రశాంతంగా పోలింగ్

నవతెలంగాణ-దండేపల్లి

సాదరణ ఎన్నికల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటు వేసేందుకు జనాలు భారీగా తరలివచ్చారు. మంద కోడిగా ప్రారంభమైన ఓటింగ్ మధ్యాహ్నం సమయం దాటేసరికి 60 శాతానికి చేరుకుంది. యువత పెద్ద సంఖ్యలో హాజరై వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. దండేపల్లి, కాసిపేట గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించేందుకు వెళ్లిన మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్ రావు తనయుడు విజిత్ రావుకు నిరసన సెగ తగిలింది. గ్రామంలోని యువకులు విజిత్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. తన అనుచరులతో కలిసి ఓటర్లను మభ్య పెట్టేందుకు ప్రయత్నించారని వారు ఆరోపించారు. మండలంలో ఓటింగ్ ప్రశాంతంగా కొనసాగింది. మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాలుగు గంటల లోపు లైన్‌లో వేచి ఉన్న ఓటర్లకు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు.



చాలా సంతోషంగా ఉంది

లింగాల సౌమ్య డిగ్రీ విద్యార్థిని వెల్గనూరు



తొలిసారి సాధారణ ఎన్నికల్లో ఓటు వేస్తున్నాందుకు చాలా సంతోషంగా ఉంది. మా గ్రామాన్ని అభివృద్ధి చేసే వారికి, యువతకు ఉపాధి కల్పించే వారికి ఓటు వేస్తాను. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు సరైన నాయకున్ని ఎన్నుకున్నప్పుడే దానికి విలువ ఉంటుంది.

ఉపాధి కల్పించే వారికే ఓటు వేస్తా

బోడకుంటి వేదశ్రీ, డిగ్రీ విద్యార్థిని గూడెం



తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటునందుకు మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేసే వారికి ఓటు వేస్తాను. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. నిస్వార్థంగా సేవ చేసే వాళ్ళు రాజకీయాల్లో ఉండాలి. నాయకులు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలి.

యువత రాజకీయాల్లో రాణించాలి

ఎడ్ల నితిన్ డిగ్రీ విద్యార్థి కొండాపూర్



ఓటు వేయడం చాలా సంతోషాన్ని ఇచ్చింది. యువత అన్ని రంగాల్లో రాణిస్తున్నారు కానీ రాజకీయాల్లో రాణించడం లేదు. చదువుకున్న యువకులు రాజకీయాల్లోకి వస్తే అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రజలను ఉచిత పథకాలకు అలవాటు చేయకుండా కష్టపడి పనిచేసుకునేలా ఉపాధి కల్పించాలి. విద్య వైద్యం ఉచితంగా అందిస్తే సరిపోతుంది. ఉచిత పథకాలతో దేశ అభివృద్ధి కుంటుపడుతుంది. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే నాయకునికి ఓటు వేస్తాను.

పోలింగ్ సరళిని పరిశీలించిన పోలీస్ కమిషనర్



నవతెలంగాణ-వేమనపల్లి

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వేమనపల్లి మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోందని పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి తెలిపారు. గురువారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. నీల్వాయిలో ఎర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే పోలీస్ శాఖకు సమాచారం అందించాలన్నారు. ఎన్నికలనియామవళిని ఏ పార్టీ ఉల్లంఘించినా చట్టరీత్యా చర్యలు తప్పమన్నారు. సీపీ వెంట రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సై సుబ్బారావు ఉన్నారు.

పకడ్బందీగా పోలీసుల బందోబస్తు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సివిల్, బీఎస్ఎఫ్, 2వ బెటాలయిన్ సిబ్బందితో పాటు మహారాష్ట్ర హోంగార్డులు దాదాపు 2200 మంది బందోబస్తు ప్రక్రియలో పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో డీఎస్పీ ఉమేందర్ రెడ్డి బందోబస్తును ఏర్పాటికప్పుడు పరిశీలిస్తూ సిబ్బందికి సూచనలు చేశారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున కేంద్రాల వద్ద 200 మీటర్ల దూరం జనాలు గుమికూడి ఉండడంతో పోలీసులు వారిని చెల్లచెదురు చేశారు. ఆయా కేంద్రాల వద్ద ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేల వ్యవహరించిన వారిని హెచ్చరికలు జారీచేస్తు అక్కడి నుంచి పంపించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు చేపట్టారు.

లైన్‌లో నిల్చొని ఓటు వేసిన కలెక్టర్, ఎస్పీ



సతీమణితో కలిసి ఓటేసిన కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్, ఎన్నికల అదికారి రాహుల్ రాజ్ అన్నారు. గురువారం డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన 261 నంబర్ పోలింగ్ కేంద్రంలో సతిమణి శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ సాధారణ వ్యక్తిల క్యూ లైన్లో నిల్చొని మరి తన ఓటు వేశారు. జిల్లా ఎస్పీ సైతం తను కూడా క్యూ లైన్‌లో నిల్చొని ఓటు వేసి ప్రజలకు సూచన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద ఓటేసినట్లు ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ఎన్నికల పోలింగ్ నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజలు కూడా ఉదయం నుంచే క్యూ లైన్లో నిల్చొని తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని తెలిపారు. గతంలో 83 శాతం పోలింగ్ అయిందని, ఈ సారి ఆ శాతాన్ని పెంచేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమన్నారు. ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్‌కు సంబంధించి మొత్తం 768 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. ఇక్కడ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 5 గంటల నుంచే సిబ్బంది విధుల్లో ఉన్నారన్నారు. అదే విధంగా సమస్యాత్మక కేంద్రాల్లో బీఎస్ఎఫ్ బలగాలు, సాయుధ బలగాలతో బందోబస్తు చేపట్టామన్నారు. అటవీ ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్ టీం తిరుగుతుందన్నారు. ఎన్నికలను శాంతియుత వాతావరణంలో జరిగేల పూర్తి స్థాయిలో బందోబస్తును ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.



ఓటేసిన ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆకర్షించేలా పోలింగ్ కేంద్రాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వందశాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా ఎన్నికల సంఘం ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లోని 592 కేంద్రాల్లో పలు కేంద్రాలను ఆదర్శ కేంద్రాలుగా ఎంపిక చేసింది. రెండు నియోజకవర్గాల్లో 20కి పైగా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇక్కడ ఓటర్లను ఆకర్షించేల ఏర్పాట్లు చేశారు. తొరణాలు స్వాగతం పలికేల సుందరంగా తయారు చేశారు. అదే విదంగా వన్‌టౌన్ ముందర ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో మహిళ ఆదర్శ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ మహిళలు ఓటేసి సెల్ఫిలు దిగారు. అదే విధంగా చిన్నారుల కోసం ఇక్కడ ఆట వస్తువులను అందుబాటులో ఉంచారు. పిల్లలు ఆడుకోగా తల్లిదండ్రులు లోపలికి వెళ్లి ఓటేసి వచ్చారు. పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓట్ ఫర్ హోంలో వారు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేంద్రాలకు వచ్చిన వృద్ధులకు పోలీసులతో పాటు వాలంటీర్లు సహకారం అందించారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్‌చైర్‌లను అందుబాటులో ఉంచారు. పలు కేంద్రాల్లో ఆటోలను సైతం ఏర్పాటు చేశారు. దీంతో ఓటర్లు హర్షం వ్యక్తం చేశారు.

అభ్యర్థి ఫొటోపై ఇంకు.. గంటపాటు ఆగిన పోలింగ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని శాంతినగర్ డిగ్రీ కళాశాలలోని 281 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంపై ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న ఫోటోపై గుర్తు తెలియని వ్యక్తులు ఇంక్ పెట్టారు. గమనించిన అధికారులు వెంటనే పోలింగ్‌ను ఆపేసి ఆర్ఓ, ఆర్డీఓ స్రవంతికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఆమె అక్కడి చేరుకోని ఈవీఎంను పరిశీలించారు. దాని స్థానంలో వేరే వాటిని పెట్టారు. దాదాపు గంటకు పైగా ఇక్కడ పోలింగ్ అగిపోయింది. విషయం తెలిసిన బీజేపీ అభ్యర్థి పాయల శంకర్, కాంగ్రెస్ అభ్యర్థి తరపున బాలూరి గోవర్ధన్ రెడ్డి అక్కడి చేరుకొని పోలింగ్ ప్రక్రియపై అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఉద్రిక్తత వాతావరణం నెలకొనకుండా డీఎస్పీ ఉమేందర్ ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ బలగాలు, సివిల్ పోలీసులు అప్రమత్తయ్యారు. దీనిపై ఫిర్యాదు రావడంతో దాన్ని పరిశీలించి సరి చేయడం జరిగిందని ఆర్ఓ తెలిపారు. దాదాపు గంట తరువాత పోలింగ్ ప్రారంభం అయింది. ఓటమి భయంతోనే ప్రతిపక్షాల నాయకుల అనుచరులు ఇలాంటి పనులు చేశారని బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న, శ్రేణులు ఆరోపించాయి.

పోలింగ్ కేంద్రంలో ఉద్రిక్తత.. పోలీసుల లాఠీచార్జి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలింగ్ స్టేషన్‌లోనే పోలీసులు లాఠీచార్జి జరపడంతో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకున్న ఘటన ఆదిలాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని బ్రాహ్మణవాడ పోలింగ్ స్టేషన్ వద్ద గురువారం బీజేపీ, బీఆర్ఎస్ వర్గాల వారు ఘర్షణ పడటంతో పోలింగ్ స్టేషన్‌లోనే పోలీసులు ఇరు పార్టీల వారిపై లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టారు. పోలింగ్ మందకొడిగా సాగుతున్న తరుణంలో సాయంత్రం ఒక్కసారిగా ఓటర్లు పెద్ద ఎత్తున తరలిరావడంతో గందరగోళం నెలకొంది. ఓటు వేయడానికి వచ్చిన వారిని బీఆర్ఎస్ వారు అడ్డుకుంటున్నారని బీజేపీ వర్గీయులు పోలింగ్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకోగా, పోలీసులు ఆందోళన కారులను చెదరగోట్టేందుకు లాఠీచార్జ్ చేశారు. దీంతో వారు పరుగులు తీశారు.

చెదురుమదురు గొడవలతో ముగిసిన పోలింగ్

- కాగజ్‌నగర్‌లో సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత
- రాళ్ల దాడికి పాల్పడ్డ బీఆర్ఎస్, బీఎస్పీ కార్యకర్తలు
- దాడిలో పోలీసులకు గాయాలు



ఆందోళనకారులను చెరదగొట్టి మాట్లాడుతున్న పోలీసులు

నవతెలంగాణ- కాగజ్‌నగర్/కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో సిర్పూర్ అసెంబ్లీ ఎన్నికలు గురువారం చెదురుమదురు గొడవలతో ముగిశాయి. ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభం కాగా పట్టణంలోని ఫాథిమా కాన్వెంట్ పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప, బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్, బెజ్జూర్ మండలంలోని రెబ్బెన పోలింగ్ కేంద్రంలో బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వరుస సంఖ్యలో మొదటి నియోజకవర్గమైన సిర్పూర్ నియోజకవర్గం కాగజ్‌నగర్ మండలం మాలిని గ్రామంలోని మొదటి పోలింగ్ కేంద్రంలో తొలి ఓటరు ఆత్రం రంబాబాయి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలోని జంబుగ పోలింగ్ కేంద్రం నెం.33లో మధ్యాహ్నం 2గంటల వరకు 80 శాతం ఓటింగ్ పూర్తికాగా ఆ తదుపరి ఎవరూ ఓటు వేయడానికి రాకపోవడంతో అధికారులు ఖాళీగా కూర్చున్నారు. 533 ఓట్లకుగానూ 491 ఓట్లు పోలయ్యాయి. మండలంలోని పాతసార్సాల గ్రామం బూత్ నెం.36 వద్ద కాంగ్రెస్ ఏజెంట్ ఇందూరి రవిపై బీఆర్ఎస్ నాయకులు దాడికి పాల్పడ్డారు. బాధితుడిని ప్రైవేట్ ఆస్పతికి తరలించి చికిత్స చేయించారు. బాధితుడిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రావి శ్రీనివాస్ పరామర్శించారు. దాడికి తగిని మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. పలు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో కొంత అంతరాయం కలిగింది. అధికారులు స్పందించి సకాలంలో నూతన ఈవీఎంలు ఏర్పాటు చేయడంతో ఆయా పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ కొనసాగింది. మండలంలోని కోసిని పోలింగ్ కేంద్రంలో వద్ధులకు వీల్ చైర్ ఏర్పాటు చేసినప్పటికీ ర్యాంపు లేకపోవడంతో ఓటర్లను ఎత్తుకుని తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఓటర్లను ఓటు వేయించేందుకు అనుమతించగా రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది.

పట్టణంలో సాయంత్రం ఉద్రిక్తత

సాయంత్రం 6గంటల సమయంలో పట్టణంలోని బీఎంఎస్ కార్యాలయం ఎదుట గల ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు రిగ్గింగుకు పాల్పడుతున్నారని బీజేపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. దీనికి బీఎస్పీ నాయకులు సైతం మద్దతు తెలిపి ఆందోళన నిర్వహించారు. అక్కడికి చేరుకున్న బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్ బాబు లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలింగ్ సమయం ముగియడంతో పోలీసులు నిరాకరించారు. దీంతో హరీష్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా బీఎస్పీ వర్గాలు నినాదాలు చేశారు. బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అక్కడికి చేరుకుని బైటాయించి ఆందోళన చేపట్టారు. ఇరు పార్టీల అభ్యర్థుల బైటాయింపుతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా బీఎస్పీ, బీఎస్పీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు నినాదాలతో హోరెత్తించారు. దీంతో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు కోనేరు కృష్ణారావు అక్కడికి చేరుకుని బీఎస్పీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసు బలగాలు సరిపడా లేకపోవడంతో వారిని వారించలేని పరిస్థితి నెలకొంది. ఈ దశలో పలువురు చెప్పులు విసిరి దాడులకు పాల్పడ్డారు. ఇది కాస్తా రాళ్లదాడికి దారితీసింది. రాళ్ల దాడిలో కరీంనగర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీనివాస్, టౌన్ ఎస్సై గంగన్న, పీసీ రత్నాకర్‌తో పాటు పలువురికి గాయాలయ్యాయి. డీఎస్పీ చేతి వేలికి గాయమై రక్తస్రావం జరిగింది. టౌన్ ఎస్సై గంగన్న తలకు గాయమైంది. దీంతో పోలీసులు లాఠీచార్జి చేసి మూడు గ్రూపులను చెదరగొట్టారు. అయినప్పటికీ ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

• 82.67 శాతం పోలింగ్ నమోదు

నవతెలంగాణ-భీమారం

చెన్నూర్ నియోజకవర్గం అసెంబ్లి ఎన్నికల నేపథ్యంలో మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించగా సాయంత్రం 4:00 పోలింగ్ కేంద్రాల గేట్లను మూసివేశారు. కోన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో అప్పటికే క్యూలైన్‌లో ఉన్నవారంతా తమ ఓటును వియియోగించుకునేందుకు రాత్రి 7 గంటల వరకు వేచి ఉండాల్సి వచ్చింది. మండల పరిధిలో 12,678 ఓటర్లు ఉండగా 82.67శాతంగా పోలింగ్ నమోదు అయినట్లు మండల రిటర్నింగ్ అధికారి, స్థానిక తహసీల్దార్ బత్తుల విశ్వంబర్ తెలిపారు. గత ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ 6 శాతం అధికంగా నమోదైంది. అధికారులు ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ముందుగానే అన్ని ఏర్పాట్లు చేశారు. 11 గ్రామ పంచాయితీలకు గాను 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వాహణ కోసం 74 మంది అధికాలు పోలింగ్ ప్రక్రియలో భాగంగా విధులను నిర్వహించారు. ఎన్నికల



నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా శ్రీరాంపూర్ సీఐ జి.రమేష్ బాబు అధ్వర్యంలో స్థానిక ఎస్సై రాజవర్ధన్ బందోబస్తును పర్యావేక్షించారు.

కాసిపేటలో 78 శాతం పోలింగ్

నవతెలంగాణ-కాసిపేట

మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలోని మొత్తం 35 పోలింగ్ కేంద్రాలకు నాలుగు రూట్లను ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. మండలంలో ఓటర్లు 26868 కాగా 21193 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 78 శాతం పోలింగ్ నమోదైంది. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ పరిశీలించి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. 1వ పోలింగ్ కేంద్రం వెంకటాపూర్‌లో 88 శాతం, 2వ కేంద్రం అరడిపల్లిలో 79 శాతం, 3వ కేంద్రం సోనాపూర్లో 95 శాతం, 4వ కేంద్రం గట్‌రాంపల్లిలో 90.4 శాతం, దేవాపూర్‌లోని 5వ కేంద్రంలో 79 శాతం, 6వ కేంద్రంలో 75 శాతం, 7వ కేంద్రంలో 72 శాతం, 8వ కేంద్రంలో 76 శాతం, 9వ కేంద్రంలో 60.22 శాతం, 10వ కేంద్రంలో 62.21శాతం, 11వ కేంద్రంలో 71.88 శాతం, 12వ కేంద్రంలో 68.75 శాతం, 13వ కేంద్రంలో 79.14 శాతం, 14వ కేంద్రం మల్కేపల్లిలో 85.63 శాతం, 15వ కేంద్రం రొట్టెపల్లిలో 88.97 శాతం, ధర్మారావుపేటలో 16వ కేంద్రంలో 80.3 శాతం, 17వ కేంద్రంలో 81 శాతం, 18వ కేంద్రం పల్లంగూడలో 83 శాతం, 19వ కేంద్రం కోనూర్‌లో 78.9 శాతం, 20వ కేంద్రం కోటిమచేను 85.5 శాతం, 21వ కేంద్రం రేగులగూడ 84 శాతం, 22వ కేంద్రం కొండాపూర్‌లో 85.71 శాతం, ముత్యంపల్లిలోని 23వ కేంద్రంలో 79.4, 24వ కేంద్రంలో 83 శాతం, 25వ కేంద్రంలో 80 శాతం, 26వ కేంద్రం 76.7 శాతం, 27వ కేంద్రం 80 శాతం, 28వ కేంద్రం 80 శాతం, 29వ కేంద్రం 68 శాతం, 30వ కేంద్రంలో 79 శాతం, 31వ కేంద్రంలో 81.6 శాతం, 32వ కేంద్రంలో 82.26 శాతం, 33వ కేంద్రం పాత వరిపేటలో 78.5 శాతం, పెద్దనపల్లిలో 34వ కేంద్రంలో 69 శాతం, 35వ కేంద్రం 69 శాతం ఓట్లు నమోదయ్యాయి.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

• మొరాయించిన ఈవీఎంలు • యువకుల ఓట్లే కీలకం • ఓటు కోసం బారులు తీరిన జనం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

అసెంబ్లీ ఎన్నికలు మండలంలో ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఉదయం నుంచే బారులు తీరారు. మండలంలో మొత్తం 48 పోలింగ్ స్టేషన్‌లు ఉండగా ముప్పై వేలపై చిలుకు ఓటర్లు ఉన్నారు. హార్కాపూర్ పోలింగ్ స్టేషన్ (36), దనోర(బి), ఈశ్వర్ నగర్ తదితర పోలింగ్ కేంద్రాల వద్ద ఈవీఎంలు మోరాయించడంతో సిబ్బంది వచ్చి సరిచేశారు. దీంతో పై కేంద్రాల్లో కొద్ది సేపు ఓటర్లకు అంతరాయం ఏర్పడింది. అంజి పోలింగ్ కేంద్రంలో పోలింగ్ మందకొడిగా సాగడంతో ఓటర్లు తమ ఓటు హక్కు కోసం గంటల తరబడి బారులు తీరారు. ముఖ్యంగా మహిళలు, చిన్న పిల్లల తల్లులు ఇబ్బందులకు గురయ్యారు. వృద్ధులు, వికలాంగులు, నడవలేని వారి కోసం అధికారులు వీల్ చైర్‌ను అందుబాటులో ఉంచి వాటి ఓటు హక్కును కల్పించారు. వృత్తి రీత్యా మహారాష్ట్ర, హైదరాబాద్‌లో ఉన్నవారు తమ స్వంత గ్రామానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మారుమూల సమస్యాత్మక గ్రామాల్లో పారా మిలటరీ బలగాలతో గట్టి పోలీసు బందోబస్తును నిర్వహించారు. ఈ అసెంబ్లీ ఎన్నికలలో యువ ఓటర్లే కీలకంగా మారారు. ఉన్నత చదువులు చదివిన వారు, ఉద్యోగాల కోసం కోచింగ్



తీసుకునే వారు స్వంత గ్రామానికి వచ్చి ఓటును వేశారు. మరో వైపు మండలంలో ఈ సారి సామాజిక వర్గాల వారీగా ఓట్లు వేసిన్నట్లు సమాచారం. వీరి భవిష్యత్తు ఈవీఎం భద్ర పరిచారు.

కుభీర్‌లో ప్రశాంతంగా సాగిన పోలింగ్

నవతెలంగాణ-కుభీర్



మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అసెంబ్లీ ఎన్నికలు గురువారం ఉదయం 7గంటలకు ప్రారంభమై సాయంత్రం 5గంటల వరకు ప్రశాంతంగా కొనసాగింది. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు బారులు తీరారు. కొన్ని గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో కాస్త ఓటర్లకు ఇబ్బంది కలిగింది. అదే విధంగా మండలంలో ఉన్న అన్ని గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఓటర్లు తమతమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం ఓటర్లు 38,822 ఉండగా అందులో పోలింగ్ అయిన ఓట్లు 32,477 అందులో పురుషులు 15,982 ఉండగా, మహిళలు 16,495 ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 83.65శాతం ఓటరు నమోదు అయినట్టు ఎన్నికల అధికారి తెలిపారు.

సిరికొండలో ప్రశాంతంగా పోలింగ్

నవతెలంగాణ-సిరికొండ

మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో మొత్తం ఖానాపూర్, బోథ్ సెగ్మెంట్ల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా ఎన్నికలను నిర్వహించారు. అక్కడక్కడ పోలింగ్ కేంద్రాల్లో టెంట్లను ఏర్పాటు చేయకపోవడంతో ఎండలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల కేంద్రంలో రాత్రి 7 గంటల వరకు పోలింగ్ జరిగింది.



ముధోల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు

నవతెలంగాణ-ముధోల్

ముధోల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులు గురువారం తమ గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. బైంసా మండలంలోని దేగాం గ్రామంలో ముధోల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్ రెడ్డి, బైంసాలో బీజేపీ అభ్యర్థి రామారావు పటేల్, కాంగ్రెస్ అభ్యర్థి నారాయణరావు పటేల్, ముధోల్ మండలంలోని రువ్వి గ్రామంలో బీఎస్పీ అభ్యర్థి సర్దార్ వినోద్ కుమార్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని వారు కోరారు.

మండలంలో 85 శాతం పోలింగ్ నమోదు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని 12 గ్రామపంచాయతీల పరిధిలో 19 పోలింగ్ కేంద్రాల్లో 85 శాతం పోలింగ్ నమోదైనట్టు తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. పోలింగ్ సందర్భంగా చెడ్వాయి గ్రామంలోని 291 పోలింగ్ బూత్‌లో పోలింగ్ మందకొడిగా సాగింది. మండలంలో మొత్తం 12,237 మంది ఓటర్లకు గాను 10,402 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

లక్షెట్టిపేట పట్టణంలో ప్రశాంతంగా పోలింగ్

నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట పట్టణంలో గురువారం ప్రశాంతంగా పోలింగ్ సరళి కొనసాగింది. ఓటు హక్కును వినియోగించుకునేందుకు మహిళలు, యువత అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. యువత ఓటు హక్కును ఉత్సాహంగా వినియోగించుకున్నారు. మండంలో 80 శాతం పోలింగ్ నమోదు అయింది. ఉదయం పట్టణంలోని మార్కెట్ యార్డులో కొద్ది సేపు ఈవీఎంలు మొరాయించగా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించరు. ఎన్నికలు సజావుగా కొనసాగేందుకు సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణ్‌లు బందోబస్తు నిర్వహించారు.

నస్పూర్‌లో ప్రశాంతంగా పోలింగ్

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ పట్టణంలో ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. ఒక చోట ఈవీఎం మోరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ముగిసింది. కొత్త ఓటర్లు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ స్టేషన్లను పలువురు ఎమ్మెల్యే అభ్యర్థులు సందర్శించారు. వృద్ధులకు, వికలాంగులకు సౌకర్యాలు కల్పించారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 వరకు పోలింగ్ నిర్వహించారు. 4 గంటల లోపల పోలింగ్ కేంద్రంలో ఉన్నవారికి నంబర్ చీటీలను అందజేసిపోలింగ్ నిర్వహించారు.

వరిపేటలో ఎన్నికలు బహిష్కరించిన గ్రామస్తులు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని పాత వరిపేట, కొత్త వరిపేట గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. గురువారం ఉదయం 7 గంటలకు వరిపేటలో పోలింగ్ మొదలు కాగా కొత్త వరిపేట, పాత వరిపేట చెందిన ఓటర్లు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటుతో పాటు అనేక సమస్యలను విస్మరించారని, దీంతో ఓట్లు వేయమని తెలిపారు. దీంతో అక్కడికి చేరుకున్న తహసీల్దార్ భోజన్న, ఎంపీఓ నాగరాజులు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామస్తులు విన్నవించిన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమైంది. ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఐదేళ్ల పాలనపై మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకుని పాలకులను ఎన్నుకోవాలి. పాలకులు సైతం జవాబుదారిగా ఉంటేనే ఓటు విలువ పెరుగుతుంది.

- లెక్కల హరిచరణ్, తొలి ఓటరు, కాగజ్‌నగర్